# లక్ష్మణ రేఖలు

కథ

కోవెల నా మనసులా కాకుండా ప్రశాంతంగా ఉంది. తీక్షణమైన భానుడి కిరణాలకి మేఘం గొడుగు పట్టింది కానీ గ్రీష్మతాపం శరీరాన్ని తాకుతోంది. అగ్నిగుండంలా మారిన నా మనసుని కూడా అదిమి పెట్టినా, మొహంలోనూ కళ్లలోనూ ఆ వేడి, బాధ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రదక్షిణాలు అయ్యాక ప్రసాదం తీసుకుని ఒక మూలగా కూర్చున్నాను. ఈ ఊరు... ఆ ఇల్లు వదలి వెళ్లిపోవాలి... ఇదే చివరిసారి అవుతుందేమో ఈ గుడికి రావడం! కానీ ఎక్కడికి వెళ్లాలి.

పిల్లల దగ్గర ఎన్నాళ్లుంటాను... కన్నవాళ్లు అయిన వాళ్లు ఎవ్వరైనా ప్రశ్నలతో వేధిస్తారు. ఎడతెరిపి లేని ఆలోచనలు... ఆడవాళ్లందరిదీ ఇదే పరిస్థితా... వాళ్లకంటూ దేనిమీదా హక్కు లేదా?

"ఏమ్మా అలా ఉన్నారు.. వంట్లో బాగాలేదా?" పూజారి గారు అభిషేక ప్రసాదం తెచ్చిచ్చారు.

"మీ వారు గుడి లోపలంతా పాలరాయి వేయించబట్టి చల్లగా ఉంటుందమ్మా! అందరూ కాసేపు కూర్చోడానికి వీలవుతుంది. ఆ అమ్మ మిమ్మల్ని చల్లగా చూస్తుంది!" చెప్పేసి వెళ్లిపోయారు.

'మా వారు మంచి వారా? ఆయనకంత పెద్ద మనసు ఉందా?' నిన్న జరిగిన సంభాషణ గుర్తు చేసుకుంటూ నా మనసు వెనక్కి వెళ్లిపోయింది.



జి.పద్మావతి

☆ ☆ ☆

"అంత డబ్బు ఎందుకు ఖర్చు పెట్టావు నువ్వు? నాకు చెప్పాల్సిన అవసరం లేదా?" విసురుగా అన్నారు.

"నాకా మాత్రం హక్కు లేదా? నాకు నేనుగా ఏదీ ఖర్చు పెట్టుకోకూడదా?" ఆవేశంగా అడిగాను.

"ఖర్చు చేసుకో. పది చీరలు కొనుక్కో. నగలు కొత్త డిజైన్స్ చేయించుకో. అంతేగానీ పాతికవేలు ఎవరో పిల్లకిస్తావా?" కోపంగా అన్నారు మా వారు.

"అవే ధార్మిక కార్యక్రమాలు మీరూ చేస్తున్నారుగా. మీకు అవి ఇష్టం. నేను ఇంకొకరికి ఉపయోగపడే పనికి ఖర్చు పెట్టాను. అది కూడా నా పేరునున్నదే ఇచ్చాను!"

"దానికి పనికొస్తుంది. నీకేం మిగుల్తుంది. అయినా నాకు చెప్పకుండా చేయడం తప్పు!"

"అంటే పేరు తీసుకువచ్చే పనులే చేస్తారా? మనకా డబ్బుతో పోయిందేమీ లేదు! అదనీ, ఇదనీ వ్యాపారాలు చేసి బాగానే కూడబెట్టారు కదా. ఆ పిల్లకి స్పోర్ట్స్‌లో చాలా ప్రైజులొచ్చాయి. తనకెంతో ఇష్టమైన స్పోర్ట్స్ కోచింగ్ కోసం నేను హెల్ప్ చేశాను. అయినా వాళ్లు

పరాయి వాళ్లేం కాదు.. వాళ్లమ్మ రాజమ్మ మనకి, మన పిల్లల చిన్నతనం నుండి ఈ ఇంటికి సేవలు చేస్తోంది. కోచింగ్ తీసుకుంటే ఆ అమ్మాయి స్టేట్ లెవెల్లో గుర్తింపు తెచ్చుకుంటుంది!" స్థిరంగా అన్నాను.


"నీకేమైనా సన్మానం చేస్తుందా! అయినా డబ్బు ఊరికే రావట్లేదు. నేను కష్టపడితే వస్తుంది. నాకు చెప్పకుండా నువ్వు ఖర్చు పెట్టడానికి నీకు వాళ్లు అంత కావల్సిన వాళ్లా?" నిష్ఠూరంగా అన్నాడు.

"అంటే మీకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చే పనులే చేస్తారా? ఒక మనిషికి సహాయం చేస్తే తప్పా?!" నిలదీశాను.

"నా డబ్బు, నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను. నీకు లోటు జరిగితే అడుగు!"

"మీ భార్యగా, ఈ ఇంటి యజమానురాలిగా నాకా మాత్రం స్వేచ్ఛ లేదన్న మాట. ఇంతేనా నా విలువ?" గొంతు దుఃఖంతో పూడిపోయినా అడిగింది.

"ఎన్నిసార్లు చెప్పినా నీకు అర్థం కాదా? పెళ్లయిన దగ్గర్నుండి మన పిల్లల పెళ్లిళ్లయినా నువ్వు మారలేదు" విసురుగా అన్న మాటలతో నా మనసు బావురుమంది. పాతికేళ్ల పైన కాపురం చేసి, అదీ బోలెడు సంపాదన ఉండి చిన్న సహాయం చేసే హక్కు లేదా? అని నిలదీసింది.




గబగబా బట్టలు సర్దుకుని అంత విలువలేని చోట ఉండకూడదని బయటికొచ్చేస్తూ బ్యాగ్ అక్కడే ఉంచి చివరిసారిగా ఈ గుడికొచ్చాను. కానీ మనసు చెప్పినవన్నీ చేయగలమా? మనసు మాట విని శరీరం సహకరిస్తుందా? సమాజం ఒప్పుకుంటుందా? నేను బయటికెళ్తే పిల్లలు వాళ్ల అత్తవారిళ్లలో చులకనైపోతారేమో? ఎన్ని వ్యథలెన్నో... లక్ష్మణరేఖలు... ఎవరు గీశారు... స్త్రీకేనా! ఆలోచిస్తూ ఇంటికి దారి పట్టాను. అన్నీ ఉన్నా ఏమీ లేని జీవితమా ఇది.

☆☆☆

"అమ్మగారూ... మీరు ఇచ్చిన డబ్బు తెచ్చేశానండి. దాని పెళ్లికి సాయం చేద్దురుగాని ఉంచండమ్మా!" రాజమ్మ నేను ఇచ్చిన డబ్బు తెచ్చేసింది.

"అదేంటీ, దానికి మంచి భవిష్యత్తు ఉంది. ఆటలకి ఈ రోజుల్లో చాలా ప్రాధాన్యం ఇస్తున్నారు. నీకు తెలియదు.. దాన్ని హైదరాబాద్ పంపించండి!" ఉద్వేగంగా అన్నాను.

"ఆడపిల్లనంత దూరం పంపనన్నాడండి వాళ్ల నాన్న. మనకి చదువుల కోసం పర్లేదు కానీ, ఇలా వద్దన్నాడమ్మా" రాజమ్మ మాటలకి నా దగ్గర సమాధానం లేదు.

"అమ్మగారూ అందరూ చదువులు, చదువులు అని పిల్లల్ని రుద్దుతుంటే మీరేంటమ్మా ఇలాంటి వాటికి ఖర్చు పెడతారు!" అని రాజమ్మ వెళ్లిపోయింది.

నా మనసు నా చిన్నతనంలోకి వెళ్లిపోయింది. ఇవే లక్ష్మణ రేఖలు... ఆనాడూ ఈనాడూ కూడా ఏమాత్రం మార్పు లేదు.

☆☆☆

చిన్నతనంలో స్కూల్లో ఆడించే స్పోర్ట్స్‌లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనే వారికి టీచర్ల ప్రోత్సాహం ఎక్కువగా ఉండేది. ముందు నుంచీ మంచి కోచింగ్ ఇచ్చి, రన్నింగ్, షటిల్, కోకో ఇంకా చాలా వాటిలో ఆటల పోటీలకి పంపించేవారు. తనకి ఎందులో పాల్గొన్నా తప్పకుండా 'కప్పు' వచ్చేది. అన్నీ కాకుండా ఒక దానిలో మంచి ప్రావీణ్యం సంపాదించమని నన్ను మరీ ప్రోత్సహించేవారు. ఎంతో ఇష్టమైన షటిల్ బాడ్మింటన్ మీద కాన్సంట్రేట్ చేశాను. మా స్కూలు స్టేట్ లెవెల్ పోటీల్లో పతకం సాధించింది. ఎంతో ఆనందంగా ఇంటికి వెళ్లి అమ్మకి చూపించాను. తరువాత పోటీలకి వేరే స్టేట్ వెళ్లాల్సి ఉంటుందని చెప్పాను.

"వద్దమ్మా! ఊళ్లోనే కదా నువ్వు ఇష్టపడుతున్నావని పంపించాం. వేరే చోటికి వెళ్లడం, ఆడపిల్లకి అంత అవసరం లేదు. అయినా మన ఇంటా వంటా లేదు... నీకిదేం పిచ్చి!" నిక్కచ్చిగా చెప్పింది అమ్మ.

"అది కాదమ్మా! మా మేడమ్ నా కోసం చాలా



## ఆర్ట్ సినిమాలు చెయ్యను

గ్లామరస్ స్టార్ ఫర్జానా ఆమధ్య జోరు జోరుగా సినిమాల్లో కనిపించింది కానీ ఈమధ్య చాన్సులు బాగా తగ్గిపోయాయి. తనకి కామెడీ సినిమాల హీరోయిన్‌గా ముద్ర పడిందని మొహమాటం లేకుండా చెప్పుకునే ఫర్జానాకి అన్ని తరహా పాత్రలూ పోషించాలని వుందిట. అలాగని ఆర్ట్ సినిమాలు మాత్రం ఇప్పుడే చెయ్యనంటోంది. కమర్షియల్‌గా రాణించగలిగే పాత్రలయితేనే ప్రస్తుతం తనకి బాగా ఉపయోగపడతాయనేది ఆమె ఫీలింగ్. అంతేమరి!

శ్రమ పడ్డారు. ఒక్కదాన్నే కాదు. గ్రూప్‌గా వెళ్తాం. మా స్కూలుకి తప్పకుండా పతకం వస్తుంది. నే వెళ్తాను... ఒప్పుకోమ్మా!" ఎంతో బ్రతిమలాడాను.

"నిన్ను చదివించడమే గొప్ప. ఆటలూ అదీ ఇదీ అని అలా తిరిగితే వేరే విధంగా చెప్పుకుంటారు. అయినా ఆడపిల్లలు పెద్దయ్యాక అలాంటివి చేయకూడదు!" ఖచ్చితంగా చెప్పింది అమ్మ.

మరునాడే డిపార్టుమెంట్ హెడ్ ఇంటికొచ్చారు. "తనకి మంచి ఫ్యూచర్ ఉంది. స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగం వస్తుంది. ఎంతో మంది అమ్మాయిలు ఇప్పుడు ఒలింపిక్స్‌లో పాల్గొంటున్నారు. ఇంకా రావాలి. మీ అమ్మాయి ఆణిముత్యం" అని నచ్చచెప్పారు.

నాన్న ససేమిరా అన్నారు. చెప్పేది వినకుండా లేచి లోపలికెళ్లిపోయారు.

ఆటలనే ఆనందవాహినికి ఆనకట్ట కట్టేసి లక్ష్మణరేఖ గీసేశారు. నా కోపం చదువు మీద చూపించాను. మంచి మార్కులతో ప్లస్ టూ కూడా పాసయ్యాను. ఎంతో ఉత్సాహంగా డిగ్రీ కాలేజీకి అప్లికేషను పెడుతుంటే "ఇంక వద్దు ఈ చదువు చాలు, నువ్వింకా పెద్ద చదువు చదివితే సంబంధం దొరకడం కష్టం అన్నారు" నాన్న.

"నేనిప్పుడే పెళ్లి చేసుకోను నాన్నా! ఇంకా చదువుకుంటాను!" అభ్యర్థనగా అడిగాను.

"నీకుండకపోయినా అది నా బాధ్యత. నీ వెనకాల ఇంకా ముగ్గురున్నారు. నన్ను నా బాధ్యతల్ని నెరవేర్చనీ" తిరుగులేని సమాధానం చెప్పి చదువుకోవాలనే కోరికకి లక్ష్మణ రేఖ గీసేశారు. పెళ్లి అనే చట్టంలో నా జీవితాన్ని బిగించేశారు.

☆ ☆ ☆

అతని పద్ధతి కొద్దికొద్దిగా అర్థం అయింది. ఎంతసేపూ డబ్బు ధ్యాస మనిషికి విలువనిచ్చేది డబ్బు మాత్రమే. విలువలక్కాదనేది అతని అభిప్రాయం. లగ్జరీ లైఫ్ కావాలి. చిన్న సహాయం చేసినా పదిమందికి తెలియాలి. డ్రస్సింగ్, ఇష్టాలు అన్నీ అతను చెప్పినట్లుండాలి. భార్య ఎంతగా అలంకరించుకుంటే అంతగా స్టేటస్ పెరుగుతుందనేది అతని విశ్వాసం. చిన్న ఉద్యోగం నుండి అంచెలంచెలుగా ఎదిగి వ్యాపారాలు మొదలు పెట్టాడు.

"అంత ధన వ్యామోహం ఉండకూడదమ్మా!" తల్లితో అన్నప్పుడు అతన్నే సమర్థించింది.

"తప్పు ఏమిటే! మరీ చిత్రంగా మాట్లాడుతున్నావు. అన్నీ అమర్చి పెడుతుంటే బాధపడే దాన్ని నిన్నే చూశాను. వెనకటకి ఎవడో నీలాంటివాడు అన్నీ ఉన్నా అరు, నూరవట్లేదని బావిలో దూకాడట. చక్కని సంసారం పాడుచేసుకుంటావా? దూరంగా వచ్చేస్తుందట... అతను చెప్పినట్లు వింటే నష్టం ఏమిటి? నువ్వు ఇలాంటి వేషాలు వేస్తే వెనకాల నీ చెల్లెళ్లకి పెళ్లిళ్లు అవుతాయా?!" అమ్మ సివంగి అవతారం ఎత్తింది.

అలాగే నా స్వతంత్ర భావాలకు లక్ష్మణరేఖ గీసేసుకున్నాను. సర్దుకుపోవడం అలవాటు చేసుకుని పిల్లల పెంపకంలో మర్చిపోయాను. ఇద్దరిలో ఒకర్నైనా అశ్వనీ నాచప్ప, పిటీ ఉష అంత కాకపోయినా స్పోర్ట్స్‌లో ఉండాలన్న నా కోరిక తీరలేదు. ఇప్పటి తరం వాళ్లు... స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నారు. వాళ్లకి నచ్చిందే చదివారు. అయినా నా కోరిక మనవరాలితో తీర్చుకున్నాను. దాన్ని దగ్గరపెట్టుకుని బాడ్మింటన్‌లో మంచి కోచ్‌గా మారాను. అదే ఆశ కోరికతో ఉన్న రాజమ్మ కూతురికి సహాయం చేసినందుకు ఆయన నన్ను ఎంత రాద్ధాంతం చేశారు.

పిల్లలు పెద్దవాళ్లయి జీవిత చరమాంకంలో ఉన్న నాకు, నేను గడపలేని జీవితాన్ని వేరే వారికి అందేలా చూడ్డంలో తప్పేమిటి? నాకా మాత్రం హక్కు లేదా? పిల్లలికి చెబితే, నాన్నగారికి చెప్పకుండా ఇవ్వడం తప్పు కాదా? అంటారు. అమ్మ బ్రతికుంటే చీవాట్లు పెట్టేది. నిజంగా చెప్పొంటే ఆయనిచ్చే వారా? నా కళ్లల్లో సన్నటి నీటి పొర... చల్ల గాలి తగిలి చుక్కలుగా మారి కన్నీరుగా జలాజలా రాలింది.


ఫోన్ మ్రోగిన శబ్దంతో ఇప్పటి ప్రపంచంలోకి వచ్చాను. అన్యమనస్కంగానే ఫోన్ తీశాను. "అమ్మా! నీ మనవరాలికి స్పోర్ట్స్ కాంపిటీషన్స్ జరుగుతున్నాయట. బెంగుళూరు వెళ్లాలిట. మాకిద్దరికీ కుదరదు. మీ అల్లుడుగారు వద్దంటున్నారు. ఏం చేయను?" అమ్మాయి ఫోన్.

"తను వెళ్తానందా, వెళ్లనని చెప్పిందా?" ఆసక్తిగా అడిగాను.

"ఇన్నాళ్లూ నీ దగ్గరే ఉండి నేర్చుకుంది కదా... ఇప్పుడిక పంపించం అన్నానని అలిగి కూర్చుంది. అయినా స్టడీస్ దెబ్బతింటాయమ్మా! నువ్వు దాన్ని సమర్థించకు" కొంచెం విసుగ్గా అంది నా కూతురు.

"ఇప్పుడు పరీక్షలు ఏం లేవు కదా! ఇష్టమైన పని చేయనిస్తే చదువు ఇంకా బాగా చదువుతారు. మీరు ఎవరూ వెళ్లకపోతే వాళ్ల టీచర్స్‌తో పాటూ నేను తోడుంటాను. నాతో పాటు మన రాజమ్మ కూతురు కూడా వస్తుంది. ఇప్పుడే బయలుదేరుతున్నా" అని ఫోన్ పెట్టేశాను.

గబగబా బట్టలు సర్దిన బ్యాగ్ తీసుకుని ఇల్లు రాజమ్మకి అప్పజెప్పి ఆయనకి ఫోన్ చేసి చెప్పి రాజమ్మ కూతురితో రైల్వేస్టేషన్‌కి బయలుదేరాను. నవతరానికైనా లక్ష్మణరేఖలు గీయకూడదని, వీలైతే చేయూతనందించి సమస్యలనధిగమించి వారు కోరుకున్న విజయాన్నందివ్వాలని కొత్త ఉత్సాహంతో ముందుకు కదిలాను. ☆



## భాగ్యనగరం బాగుంది

స్నేహా ఉల్లాల్‌కి హిందీలో అవకాశాలు ఎలాగూ లేవు కాబట్టి తెలుగులోనే సెటిలవాలనుకుంటోంది. తమిళం, కన్నడ భాషల్లో కూడా స్నేహాకి అవకాశాలు వస్తున్నప్పటికీ తన ప్రాధాన్యత మాత్రం తెలుగుకే అని నొక్కి వక్కాణిస్తోంది. తనకి హైదరాబాదు ఎంతగానో నచ్చిందిట. అందుకే తెలుగు సినిమాల్లో నటిస్తూ ఇక్కడే సెటిలవాలని ఆశపడుతోంది స్నేహ. మరి ఆమె కోరిక తీరాలనే అనుకుందాం.